ప్రజాశక్తి
శుక్రవారం 21 మార్చి 2025 5
అనంతపురం




హోం, కిచెన్ గార్డెన్లతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా రీసోర్స్ సెంటర్ ఆత్మా పీడీ మద్దిలేటి

ఉరవకొండ : హోమ్, కిచెన్ గార్డెన్‌లతో ప్రతి ఒక్కరూ వారి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని జిల్లా రీసోర్స్ సెంటర్ ఆత్మా పీడీ మద్దిలేటి సూచించారు. గురువారం ఉరవకొండ డివిజన్ పరిధిలోని గుంతకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ, విడపనకల్లు గ్రామ రైతు సేవా కేంద్రా సిబ్బందికి ఎడిఎ శైలజ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా మిద్దెతోటల పెంపకం, కిచెన్ గార్డెన్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. మిదె తోటలు పెంచుకోవడం వల్ల రసాయన మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయంతో మనం తినాల్సిన పంటలను మనమే పండించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ శైలజ, ఎఒలు విజయకుమార్, మధుకర్, పెన్నయ్య, శుభకర్, ఎఇఒలు, రైతు సేవాకేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

మార్చిలోనే మండుతున్న ఎండలు

41.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
బయటకు రావటానికి జంకుతున్న జనం



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మార్చి ఆరంభంలోనే ఎండలు మండుతున్నాయి. వారం రోజుల క్రితం వరకు కొంత వరకు చల్లటి వాతావరణం ఉంటూ వచ్చింది. గడిచిన నాలుగైదు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. గురువారం నాడు అత్యధికంగా 41.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. మండుతున్న ఎండలకు జనం బయటకు రావాలంటే భయపడిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. మధ్యాహ్న సమయాల్లో జనం బయటకు రాలేకపోతున్నారు. దీంతో ప్రధాన రహదారులు నిర్మానుష్యమవుతున్నాయి. పాఠశాలలు కూడా ఒంటిపూట కావడంతో మధ్యాహ్నంలోపు ఇళ్లకు చేరుతున్నారు.

కనిపించని చలివేంద్రాలు

ఎన్నికలుంటే ఎక్కడ లేని సేవా కార్యక్రమాల్లో చేపట్టే నేతలు..అవి లేకపోవడంతో ఈఏడాది ఎక్కడా చలివేంద్రాలు కనిపించడం లేదు. లేకపోతే ప్రతి ప్రధాన కూడళ్లలోనూ చలివేంద్రాలు ఏర్పాటు చేసే వారు. ముఖ్య కార్యాలయాల వద్ద కూడా వీటి దాఖలాలు కనిపించడం లేదు. దీంతో జనం దాహమైతే కూల్ డ్రింక్స్ దుకాణాల వైపు చూడాల్సి వస్తోంది. సేవ చేసే నేతలెవరూ ఇప్పుడు కనిపించడం లేదు.

ఎలక్ట్రానిక్ పరికరాలకు పెరిగిన గిరాకీ

వేసవి తాపం పెరుగుతుండటంతో ఎయిర్ కూలర్లు, ఎసిలు, ఫ్రిడ్జ్‌లకు గిరాకీ పెరిగింది. దీనికి తగ్గట్టు ఆఫర్లను ప్రకటిస్తున్నాయి. అదే విధంగా మట్టి కుండల కొనుగోళ్లు పెరిగాయి. ఎలక్ట్రానిక్ పరికారల్లో కాకుండా నేచరల్‌గా నీటిని చలువ చేసుకుందామనుకున్న వాళ్లు వీటిని కొంటున్నారు.


రొద్దం మండలంలో ఎండలో నడిచివెళుతున్న పదోతరగతి విద్యార్థినులు

తేదీ	ఉష్ణోగ్రత డిగ్రీల్లో
14-03-2025	40.4
15-03-2025	39.8
16-03-2025	39.2
17-03-2025	40.2
18-03-2025	39.2
19-03-2025	40.7
20-03-2025	41.1

శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులకు
బకాయి వేతనాలు చెల్లించాలి

రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ కమిషనర్‌కు సిఐటియు వినతి


రాష్ట్ర కార్మికశాఖ కమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, తదితరులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రజలకు దాహార్తి తీరుస్తున్న శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరాలో పని చేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలు, పిఎఫ్ చెల్లించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం విజయవాడలో కార్మిక సంక్షేమ శాఖ కమిషనర్‌ను సిఐటియు నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో ఉమ్మడి జిల్లాలో 600 మంది కార్మికులు 14 సంవత్సరాలుగా పని చేస్తూ 850 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారని తెలిపారు. కార్మికులందరూ ముగ్గురు కాంట్రాక్టర్ల వద్ద పని చేస్తున్నారని తెలిపారు. అయితే సదరు కాంట్రాక్టర్ నెల నెలా సరిగ్గా వేతనాలు చెల్లించడం లేదన్నారు. పిఎఫ్ జమ చేయడం లేదన్నారు. పైగా కార్మికుల వేతనాల్లో రూ.2,500 కోత విధిస్తున్నారని తెలిపారు. లేబర్ చట్టం ప్రకారం సదరు కాంట్రాక్టర్ 10వ తేదిలోపు కార్మికులకు వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. కాంట్రాక్టర్లు చెల్లించని పక్షంలో ఆర్‌డబ్ల్యుఎస్ సంస్థ చెల్లించాలని ఆ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఏ నెలకు ఆ నెల వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కమిషనర్ సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాగునీటి కార్మికుల యూనియన్ నాయకులు ప్రభాకర్, వన్నూరుస్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మారిన కార్పొరేటర్ల స్వరం..!

మేయర్‌పై అవిశ్వాస లేఖాస్త్రం వెనక్కు
సంతకాలు చేసి తప్పు చేశామంటూ కార్పొరేటర్ల ముక్తాయింపు
ముఖ్యనేతపై కోపంతోనే ఇదంతా చేశామంటూ మేయర్ ఎదుట వివరణ


అనంతపురం నగరపాలకసంఘ కార్యాలయం

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్ మేయర్ మహమ్మద్ వసీం సలీంపై అవిశ్వాసం పెట్టబోతున్నారంటూ రెండురోజులుగా జరుగుతున్నా ప్రచారానికి ఫుల్‌స్టాప్ పడినట్లు తెలుస్తోంది. మూడు రోజుల క్రితం కొందరు వైసిపి కార్పొరేటర్లు మేయర్‌పై అవిశ్వాస లేఖాస్త్రం సంధించారు. ఈ పరిణామంతో మేయర్ రాజీనామా చేసే పరిస్థితి ఏర్పడుతుందని అటు వైసిపి, ఇటు టిడిపి నేతలు భావించారు. ప్రస్తుతం ఇది బెడిసి కొట్టినట్లు తెలుస్తోంది. లేఖాస్త్రంపై సంతకాలు చేసిన మహిళా కార్పొరేటర్లు నిర్ణయం మార్చుకోవడంతో అవిశ్వాసం అంశం తెరమరుగు కానుంది.

మేయర్ వసీంపై అవిశ్వాసం ప్రకటిస్తూ లేఖాస్త్రంపై సంతకాలు చేసిన పలువురు మహిళా కార్పొరేటర్లు వెనక్కు తగ్గారు. సంతకాలు చేసి తాము తప్పు చేశామంటూ పాలకవర్గ నేతతో స్వయంగా కొందరు, ఫోనులో మరికొందరు మాట్లాడారు. సంతకాల నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంటున్నట్లు కూడా వారు తెలిపారు. పార్టీలోని ముఖ్య నేత వైఖరికి నిరసనగానే తాము సంతకాలు చేయాల్సి వచ్చిందని, పాలకవర్గం నేతపై తమకు ఎలాంటి అసంతృప్తి లేదని పేర్కొన్నట్టు తెలుస్తోంది. ముఖ్య నేతతో విభేదాలున్న ఆ ఆరుగురు కార్పొరేటర్లు తమ సత్తా ఏమిటో ఆ నేతకు, పార్టీకి తెలియజెప్పాలన్న ప్రయత్నంలో భాగంగానే అవిశ్వాస అంశం తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది.

పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సొంత పార్టీ ప్రజాప్రతినిధికి ఇబ్బందులు సృష్టించవద్దని, ఈ విషయంలో ముఖ్యనేతను కలిసి చర్చించాలని అధిష్టానం అసమ్మతి కార్పొరేటర్లకు సూచించినట్లు సమాచారం. సదరు కార్పొరేటర్లు ముఖ్య నేతను కలిసేందుకు విముఖత వ్యక్తం చేశారు. అధిష్టానం మాత్రం అందరినీ కలుపుకుని వెళ్లి పార్టీని బలోపేతం చేసేలా పని చేయాలని ముఖ్య నేతకు సూచించింది. ఇదే సమయంలో ముఖ్యనేత గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో తన ఓటమికి ప్రత్యర్థి పార్టీలతో కలిసి పని చేసిన సదరు కార్పొరేటర్లు, నాయకులతో సయోధ్య కుదుర్చుకోవడం తనకిష్టం లేదని అధిష్టానానికి తెల్చి చెప్పినట్లు ఆపార్టీ వర్గాల్లో విన్పిస్తోంది. ఇదే సమయంలో అవిశ్వాస లేఖాస్త్రం ద్వారా పాలకవర్గం నేతకు మహిళా కార్పొరేటర్ల మద్దతు లభించినట్లు అయ్యింది. ముఖ్య నేత ఆశావహుల ప్రయత్నాలు మాత్రం బెడిసి కొట్టినట్లుగా కన్పిస్తోంది.

అవిశ్వాసం అంశం జరుగుతున్న నేపథ్యంలో మేయర్ పీఠంపై ఆశ పెట్టుకున్న కొందరు కార్పొరేటర్లు స్వయంగా పార్టీ నేతను కలిసి తమ ఆసక్తిని వ్యక్తపరిచినట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. సంతకాలు చేసిన కార్పొరేటర్లు వారి నిర్ణయాన్ని మార్చుకోవడంతో మేయర్ మార్పు అంశం ఆగిపోయింది. దీంతో కార్పొరేషన్ ముఖ్య పదవిపై ఆశలు పెట్టుకున్న వైసిపి నాయకుల ఆశలపై నీళ్లు చల్లినట్లు అయ్యింది. ఇదే సమయంలో వైసిపిలో రేగిన అసమ్మతి తమకు అనుకూలంగా మారుతుందని ఆశించిన అధికార టిడిపికి కూడా ఆశాభంగమే అయింది. మొత్తం మీద మేయర్‌పై అసమ్మతి లేఖాస్త్రం టీ కప్పులో తుపానుగా మారిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ప్రభుత్వ రంగ బ్యాంకుల పరిరక్షణ బాధ్యత ప్రజలదే

బ్యాంకు ఉద్యోగుల సమ్మెను జయప్రదం చేద్దాం
రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వాలు, పాలకులు ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసేలా ప్రయివేటీకరణను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకులను కాపాడుకోవాల్సిన బాధ్యత ఖాతాదారులుగా ప్రజలపైనే ఉందని పలువురు వక్తలు అన్నారు. బ్యాంక్ ఉద్యోగులు ఈ నెల 24, 25 తేదీల్లో చేపడుతున్న సమ్మెకు మద్దతుగా సిఐటియు ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎన్జీవో హోంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సిఐటియు నాయకులు ఏజి.రాజమోహన్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ఏఐబిఈఏ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శంకర్, సంజయ్, బెఫీ రవితేజ, ఎన్జీవో నగర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా నాయకులు ఆర్‌వి.నాయుడు, వెంకటనారాయణ, ముత్తుజా, మెడికల్ రెప్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు, ఏఇపిజి రిటైర్డ్ మేనేజర్ గోవిందరెడ్డి, ఎల్‌ఐసి ఉద్యోగుల సంఘం అనిల్ కుమార్, సూరిబాబు, బిఎస్ఎన్ఎల్ మహేష్, జనరల్ ఇన్సూరెన్స్ యూనియన్ ఎంఎన్‌టి.రాజు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, బిహెచ్.రాయుడు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాల రంగయ్య, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుల ఏటిఎం.నాగరాజు, ఎర్రిస్వామి, లక్ష్మినారాయణ, లక్ష్మినరసమ్మ, వరలక్ష్మి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ దేశంలో బ్యాంక్ ఉద్యోగం మంచిదని అందరూ భావిస్తుంటామన్నారు. కానీ నేడు బ్యాంక్‌లో పని చేస్తున్న అత్యధిక మంది యువతకు బ్యాంక్ ఉద్యోగం చేయలేమనే స్థితి ఏర్పడిందన్నారు. భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థలో ఉద్యోగులు అనేక సమస్యలకు గురువుతున్నారని, పని ఒత్తిడి పెరిగి కొందరూ ఆత్మహత్య చేసుకుంటున్న సంఘటనలు చూస్తున్నామని తెలిపారు. వీటంతటికి కొత్త రిక్రూట్‌మెంట్ చేయకపోవడమే కారణమని అన్నారు. ఖాతాదారులకు అనుగుణంగా ఆయా ప్రభుత్వ బ్యాంకుల్లో ఉద్యోగుల సంఖ్య లేకపోవడంతో ఉన్న ఉద్యోగులపై పని భారం పెరుగుతోందన్నారు. నిరుద్యోగ యువత ఎక్కువగా ఉన్న రోజుల్లో బ్యాంకుల్లో ఖాళీలను భర్తీ చేయడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందన్నారు. కడపలో సొంత భవనంలో ఉన్న ఆంధ్రప్రగతి గామీణ బ్యాంక్ (ఏపిజిబి) ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించేందుకు ప్రభుత్వం నిర్ణయించడం అన్యాయంగా ఉందన్నారు. ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐబిఈఏ) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శంకర్, సంజయ్ మాట్లాడుతూ బ్యాంక్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ 9 డిమాండ్లతో ఈ నెల 24, 25 తేదిల్లో దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10 ఏళ్ల క్రితం దేశ్యావ్యాప్తంగా ప్రభుత్వ బ్యాంకుల్లో 10 లక్షల మంది ఉద్యోగులు పని చేసేవారని, నేడు 7.5 లక్షల మంది మాత్రమే పని చేస్తున్నారని తెలిపారు. బ్యాంకుల్లో కొత్త ఉద్యోగ నియామకాలు చేపట్టడం లేదన్నారు. వారంలో 5 రోజులు పని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. 24, 25 తేదీల్లో సంగమేష్ సర్కిల్‌లోని యూనియన్ బ్యాంక్ రీజనల్ కార్యాలయం, రైల్వే స్టేషన్ వద్ద ఉన్న కెనారాబ్యాంక్ రీజనల్ కార్యాలయం వద్ద సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలతోనే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని, కావున ప్రభుత్వ బ్యాంకులను కాపాడుకోవడానికి ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గిరి, అంబులెన్స్ యూనియన్ జిలాన్, అక్బర్, డివైఎఫ్ఐ నాయకులు నూరుల్లా, లతీఫ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

3నెలల్లోపు వ్యవసాయ విద్యుత్ సర్వీసులు ఇవ్వాలి : విప్ కాలవ


అసెంబ్లీలో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

దరఖాస్తు చేసిన మూడు నెలల్లోపు రైతులకు కొత్త వ్యవసాయ విద్యుత్ సర్వీసులు మంజూరు చేయాలని విప్ కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. గురువారం అసెంబ్లీలో మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో విద్యుత్‌పై ఆధారపడ్డ వ్యవసాయరంగం అనేక సమస్యలు ఎదుర్కొంటోందని సభ దృష్టికి తీసుకొచ్చారు. చాలామంది దరఖాస్తు చేసి ఏడాదిన్నరైనా వ్యవసాయ సర్వీసులు ఇవ్వటంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. వెనుకబడ్డ రాయదుర్గం ప్రాంతంలో 2025 జనవరి నాటికి 513 మంది దరఖాస్తు చేసుకోగా కేవలం 36 మాత్రమే మంజూరు చేశారని వివరించారు. 600-700 అడుగులలోతు తవ్వినా నీరు పడటం లేదన్నారు. ఒకవేళ ఎవరికైనా నీరు పడ్డా విద్యుత్ సర్వీసుల ఆలస్యం కారణంగా పంటలు వేసుకోలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. 12 సబ్‌స్టేషన్లు మంజూరైన నేటికీ పనులు జరగలేదన్నారు. కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటుకు 464 కిలో మీటర్ల కండెన్సర్ కేబుల్ (అల్యూమినియం వైర్) కావాల్సి ఉందన్నారు. త్వరితగతినా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు.

గిట్టుబాటు ధరలేక
అరటిచెట్లను నరికివేసిన రైతు

రూ.3లక్షలు నష్టపోయానంటూ బాధిత రైతు కన్నీటి పర్యంతం


బాధిత రైతు ఉమేష్

ప్రజాశక్తి - కళ్యాణదుర్గం రూరల్

ఆరుగాలం కష్టపడి కన్నబిడ్డల్లా సాగు చేసిన అరటిపంటకు గిట్టుబాటు ధర లభించకపోవటంతో చేజేతులా అరటిచెట్లను ఓ రైతు నరికివేశాడు. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి గ్రామానికి చెందిన గునుపల్లి ఉమేష్ అనే రైతు తన మూడు ఎకరాల పొలంలో సాగుచేసిన అరటిచెట్లను గురువారం నరికివేశాడు. ఈసందర్భంగా బాధిత రైతు ఉమేష్ మాట్లాడుతూ తన మూడు ఎకరాలు పొలంలో దాదాపు రూ.3లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి అరటితోటను సాగు చేశానన్నాడు. పంట కోతకు రావడంతో విక్రయించాలని చూస్తే గిట్టుబాటు ధర లభించలేదన్నారు. దళార్లు కేజీ 8 రూపాయలు పంటను కోత కోయడానికి అడుగుతున్నారన్నారు. దీంతో దిక్కుతోచనిస్థితిలో పడ్డానన్నారు. రూ. 3లక్షల వరకు పెట్టుబడి పెట్టి కంటికి రెప్పలా పంటను కాపాడుకుంటే దిగుబడి వచ్చే సరికి ఇలా అయిందన్నారు. మార్కెట్‌లో కేజీ అరటి పళ్లు రూ.40 నుంచి 50 రూపాయల వరకు విక్రయిస్తున్నారన్నారు. అదే రైతు వద్దకు వచ్చే సరికి కేజీ కేవలం 8 రూపాయలకు అడుగుతున్నారని వాపోయారు. పంటను విక్రయిస్తే కూలి కూడా గిట్టుబాటు కాదన్నారు. దీంతో చేసేదేమీ లేక పంటను తొలగిస్తున్నానని రైతు ఉమేష్ తెలిపారు.


నరికివేసిన అరటిచెట్లు


రైతులతో మాట్లాడుతున్న కౌలు రైతుసంఘం నాయకులు

లైనింగ్ పనులు ఆపకపోతే ధర్నా

కౌలు రైతుసంఘం
జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-ఆత్మకూరు

రైతులకు నష్టం చేకూర్చే హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు ఆపకపోతే రైతులను కలుపుకుని పెద్దఎత్తున ధర్నా చేపడతామని ఎపి కౌలు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నీలపాల రామకృష్ణ హెచ్చరించారు. గురువారం మండలంలో రైతులతో మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ కింద ఉన్న బోరుబావులు అడుగంటి పోతున్నాయన్నారు. ఈనేపథ్యంలో మళ్లీ కాలువలో లైనింగ్ పనులు చేస్తామంటే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వెంటనే లైనింగ్ పనులు ఆపి టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిజంగా నాయకులకు రైతులపై ప్రేమ ఉంటే హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి పదివేల క్యూసెక్కులు నీటి ప్రవాహ సామర్థ్యం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు గోపాల్‌నాయక్, నాగరాజు నాయక్, నారాయణ, సూరి, సర్దాని, వెంకటేశు, పుల్లారెడ్డి, బయన్న, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందిపై థియేటర్ యాజమాన్యం దాడికి యత్నం

బకాయి పన్ను వసూలుకు వెళ్లిన సిబ్బందిపై దౌర్జన్యం


మున్సిపల్ సిబ్బందిని గేటు వద్దనే అడ్డుకుంటున్న థియేటర్ నిర్వాహకులు

ప్రజాశక్తి - తాడిపత్రి

తాడిపత్రి పట్టణంలోని ఎస్వి థియేటర్ యాజమాన్యం మున్సిపల్ సిబ్బందిపై దాడికి యత్నించిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఈఘటనకు సంబందించిన వివరాలు... మున్సిపాలిటీకి బాకీ పడ్డ రూ. 1.80 లక్షల పన్ను పన్ను బకాయిని చెల్లించాలని మున్సిపల్ సిబ్బంది ఎస్ వి థియేటర్ దగ్గరకు వెళ్ళగా థియేటర్ సిబ్బంది మున్సిపల్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. 'మున్సిపాలిటీ ఉద్యోగులు పన్ను వసూలు చేసేవారా నీకు ఎంత ధైర్యం. మరోసారి రావద్దని గతంలో చెప్పా. పెద్దలతో మేము మాట్లాడుకుంటాం. మేము సమాధానం ఇచ్చే స్థాయి మీది కాదు' అంటూ మునిసిపల్ అధికారులపై థియేటర్ నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మున్సిపల్ సిబ్బంది థియేటర్లోకి వెళ్లే ప్రయత్నం చేయగా థియేటర్లోకి అనుమతించేది లేదంటూ ప్రధాన గేటు వద్ద మున్సిపల్ అధికారులను అడ్డుకొని తోసివేశారు. 'పెద్దలతో మాట్లాడుకుంటాం మిమ్మల్ని లోపలికి అనుమతించేది లేద'ని నిర్వాహకులు తెగేసి చెప్పడంతో చేసేదేమీ లేక మున్సిపల్ ఉద్యోగులు వెనితిరగాల్సి వచ్చింది. మున్సిపల్ అధికారులు జరిగిన సంఘటన కమిషనర్ దృష్టికి తీసుకుపోగా ఐదు రోజులు గడువు ఇచ్చినట్టు తెలిసింది. ఈతంగాన్ని గమనించి పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న పాత్రికేయులు అక్కడికి చేరుకుని జరుగుతున్న సంఘటనను కవర్ చేయబోగా పాత్రికేయుల పైన థియేటర్ నిర్వాహకులు చిందులేశారు. 'పని పాట లేకుండా తిరుగుతూ విలేకరులంటూ ఉంటారు. మీరు విలేకరులు అయితే మాకేంటి మా థియేటర్లో వీడియోస్ తీస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంద'ని బెదిరించారు. ఇది ఇలా ఉండగా సినిమా ప్రేక్షకులకు ఎస్వి థియేటర్ సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని థియేటర్ పై పలు ఫిర్యాదులు గతంలో తహశీల్దార్‌కు అందాయి . సినీ ప్రేక్షకుల నుండి ముక్కు పిండి అధిక ధరలకు టికెట్లు విక్రయిస్తు బాత్‌రూముల నిర్వాహణ కూడా సరిగా చేయడం లేదని ప్రేక్షకులు వాపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్వెల్ సమయంలో అధిక ధరలకు కూల్ డ్రింక్స్, తినుబండారాలు అమ్ముతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఏసీ సినిమా థియేటర్ అని పబ్లిసిటీ ఇస్తూ అందుకు తగ్గ టికెట్లు వసూలు చేస్తూ వేసవి కాలం అయినా పనిచేయని ఏసీలు, ఫ్యాన్లతో సినిమాకు వెళ్లిన ప్రేక్షకులు ఉక్కపోతతో ఉడికిపోతున్నారు. గతంలో ఫిర్యాదులపై అధికారులు స్పందించి ఉంటే ఈరోజు ఎస్ వి సినిమా యాజమాన్యం ఈ స్థాయిలో మున్సిపల్ అధికారులను, విలేకరులను, ప్రేక్షకులను చులకన భావంతో చూసి ఉండేవారు కాదేమోనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



గుత్తిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అతిథులు

మత్తు పదార్థాల జోలికెళ్లొద్దు

ప్రజాశక్తి-గుత్తి

యువత మత్తు పదార్థాల జోలికెళ్లకుండా బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని శ్రీ బాలాజీ విద్యాసంస్థల ప్రత్యేక అధికారి శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో క్యాంపస్ సిఐ. ఎ.శ్రీరాములు, ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్లరెడ్డి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందన్నారు. ఇప్పుడే చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. డీన్ సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వాటి బారిన పడకుండా యువత అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో పిఆర్‌ఓ ఎంబిఎ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసన్నకుమార్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తు నిర్మించుకోవాలని ఉరవకొండ అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మహానంది పిలుపునిచ్చారు. గురువారం ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'యాంటీ డ్రగ్ అవేర్నెస్'పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ గంజాయి, తదితర మత్తు పదార్థాలు వాడకం వల్ల ఆరోగ్యం క్షీణించడమే కాకుండా ప్రాణాపాయం తలెత్తి జీవితాలు నాశనమవుతాయన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాల జోలికెళ్లకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' బిల్లులు చెల్లించాలి

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతులు

ప్రజాశక్తి-శింగనమల

పది వారాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులను చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని రాచేపల్లి గ్రామ సచివాలయంలో ఏపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సచివాలయ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో పని చేసే కూలీలకు 10 వారాలు బిల్లులు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. కనీసం ఉగాది పండుగకు అయినా బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే పనులు చేసే చోట కనీస సౌకర్యాలు కల్పించాలని, మెడికల్ కిట్లు, మజ్జిగ, పనిముట్లు ఇవ్వాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్యప్రకాష్, సుంకన్న, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, కుళ్లాయిస్వామి, నాగరాజు, సావిత్రి, ఆదినారాయణ, సూర్యనారాయణ, రామాంజి, సంధ్యారాణి, సుబ్బమ్మ, నిర్మల, సుధారాణి, కిష్టప్ప, ధనలక్ష్మి, వీరాంజి, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : మండలంలోని లింగనపల్లి, బొమ్మేపర్తి, తదితర గ్రామాల ఉపాధి పనులు చేస్తున్న కూలీలను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు బాల రంగయ్య మాట్లాడుతూ ఉపాధి కూలీలు పని చేసి నెలలు నెలలు కూలి డబ్బుల కోసం ఎదురు చూడాల్సి వస్తోందన్నారు. దాదాపుగా 45 రోజులుగా కూలి డబ్బులు పడకుండే కూలీలు ఏం తినాలని ప్రశ్నించారు. ఉగాదిలోపు ప్రభుత్వం కూలీలకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు టి.రామాంజనేయులు, సిపిఎం ప్రాంతీయ నాయకుడు పోతలయ్య, రాప్తాడు మండల నాయకులు సుబ్బిరెడ్డి, అఖిల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఉపాధి హామీ సిబ్బంది నిర్లక్ష్యంతో గ్రామాలలో కూలీలకు పనులు లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి అన్నారు. గురువారం ఏపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో విడపనకల్లు మండల పరిధిలోని ఉండబండ గ్రామంలోని సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా కేవలం రెండు గ్రామాల్లో మాత్రమే వందమందికి పనులు కల్పించడం చాలా దుర్మార్గమన్నారు. ఉండబండ గ్రామంలో పనులు కల్పించే పరిస్థితి లేదని కూలీలు ఆవేదన చెందుతున్నారన్నారు. విడపనకల్ మండలం కరువు మండలంగా ప్రకటించడంతో వంద రోజులు పూర్తి చేసుకున్న వారికి అదనంగా 50 రోజులు కల్పించాలన్నారు. ఇప్పటి వరకు చేసిన పనులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని, పనుల దగ్గర కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, జిల్లా నాయకులు పెద్దముష్టూరు వెంకటేశులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

పామిడి : మండల వ్యాప్తంగా ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని సిపిఎం మండల నాయకులు అనిమిరెడ్డి, మల్లేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం స్థానిక కార్యాలయంలో ఎంపిడిఒ తేజోష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడిగిన వారందరికీ పనులు కల్పించాలి, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, పని దినాలు పెంచాలని, రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.



రాప్తాడు మండలంలో కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస నాయకులు

వడదెబ్బపై 'ఉపాధి' కూలీలకు అవగాహన

నార్పల : మండల పరిధిలోని సిద్ధరాచర్ల గ్రామ పంచాయతీలో ఉన్న దుర్గం గ్రామంలో గురువారం ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న కూలీలకు వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బి.పప్పూరు ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి హజీరా, సూపర్‌వైజర్ శ్రీరాములు మాట్లాడుతూ ఎండ ఎక్కువగా ఉన్నందున ఉదయమే పనికి వచ్చి 10 గంటలకు ముగించుకుని వెళ్లాలని సూచించారు. తల తిరగడం, నీరసంగా ఉండటం, వాంతులు, విరోచనాలు కావడం వంటి లక్షణాలు కనిపిస్తే వడదెబ్బగా భావించి వెంటనే వైద్యులని సంప్రదించాలని సూచించారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సాకే రామాంజనేయులు, ఎంపిహెచ్ఒ శివకుమార్, ఎంఎల్‌హెచ్‌పి అమృతాంజలి, ఫీల్డ్ అసిస్టెంట్ కిష్టప్ప, నాగేష్, మారుతి, నాగభూషణ, మత్తి లక్ష్మన్న, అగ్రహారం పెద్దన్న, పకీరప్ప, తదితరులు పాల్గొన్నారు.



వడదెబ్బపై కూలీలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మొట్టమొదటి ఐఎఎస్‌కు సాయిట్రస్టు నివాళి

అనంతపురం : జిల్లా నుంచి ఐఎఎస్ సాధించిన మొదటి వ్యక్తి శివప్రసాద్ (86) మృతికి సాయిట్రస్టు ఆధ్వర్యంలో గురువారం నివాళులర్పించారు. శివప్రసాద్ జాయింట్ కలెక్టర్, కలెక్టర్, ఐటి వెల్ఫేర్ కార్యదర్శి, ప్రభుత్వ కార్యదర్శిగానే కాకుండా వివిధ హోదాల్లో పని చేసి 2002లో పదవీ విరమణ చేసి ఈనెల 18వతేదీ హైదరాబాదులో గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయి కుమార్ ఆధ్వర్యంలో అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివప్రసాద్ జిల్లాకు ఎన్నో మంచి కార్యక్రమాలు చేశారన్నారు. ముఖ్యంగా జిల్లాకు బిసి స్టడీ సర్కిల్ మంజూరు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు.

ఏప్రిల్ 27న ప్రవేశ పరీక్ష

అనంతపురం : మహాత్మ జ్యోతిబాపూలే బిసి గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి కామన్ ఎంట్రెన్స్ పరీక్ష-2025 ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 27న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం జిల్లాలో ఏడు ప్రవేశ పరీక్ష కేంద్రాలను పెంచినట్లు తెలిపారు. పెంచిన ప్రవేశ పరీక్ష కేంద్రాలను రేపటి నుంచి ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణకు ఈనెల 25వతేదీ వరకూ పొడిగించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్లు 98665 59653,90523 16764ను సంప్రదించాలని కోరారు.

శుద్ధ జల ప్లాంట్ ప్రారంభం

కళ్యాణదుర్గం రూరల్ : మండలం గోళ్ల పంచాయతీ శీబావి గ్రామంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సొంత నిధులతో ఏర్పాటు చేసిన శుద్ధజల తాగునీటి ప్లాంట్‌ను టిడిపి నాయకులు గురువారం ప్రారంభించారు. వేసవి సమయంలో శుద్ధ జలయంత్రం ప్రారంభం కావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

'నారాయణ' బుక్‌రూమ్ సీజ్

రాయదుర్గం : పట్టణంలోని నారాయణ పాఠశాలలో విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పుస్తకాల విక్రయాలు చేస్తుండడంతో విద్యార్థి సంఘాల ఫిర్యాదు మేరకు మండల విద్యాశాఖ అధికారిని నాగమణి పాఠశాల బుక్స్ స్టోర్ రూమ్‌ను గురువారం సీజ్ చేశారు. పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఇఒ నాగమణి 9వ తరగతి విద్యార్థులకు పదో తరగతి పాఠ్య పుస్తకాలు విక్రయం, తరగతుల నిర్వహణ ప్రారంభం కావడంతో విచారించి సీజ్ చేశారు.

పప్పుశనగ కొనుగోలు కేంద్రం ఏర్పాటు

యాడికి : మండల పరిధిలోని వేములపాడు పిఎసిఎస్‌లో గురువారం పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా తెలిపారు. మద్దతు ధర క్వింటా రూ.5,650తో పప్పుశనగ పంటను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. పంటను విక్రయించాలకునేవారు మీ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

బెలుగుప్ప : పప్పుశనగ రైతులు మద్దతు ధరతో పంటను విక్రయించుకునేందుకు రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పృథ్వీసాగర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.5,650తో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కావున మండలంలో పప్పుశనగ పండించిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగన్‌ను కలిసిన గుత్తి నాయకులు



జగన్‌తో గుత్తి వైసిపి నాయకులు

గుత్తి : వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్‌ను గుత్తికి చెందిన వైసిపి నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైసీపీ సీనియర్ నాయకుడు సివి.రంగారెడ్డి, ఇవి. రమణారెడ్డి, పల్లేటి మధుసూదన్ రెడ్డి, విజయరెడ్డి లను మాజీ సీఎం జగన్ ఆప్యాయంగా పలకరించారు. బాగోగులను అడిగి తెలుసుకున్నారు. వైసిపి పార్టీ కోసం కష్టపడాలని పిలుపునిచ్చారు. ప్రజలకు తోడుగా, కార్యకర్తలకు అండగా ఉండాలని నాయకులకు సూచించినట్లు తెలిపారు.

ఆశ్రమంలో నిత్యావసరాలు అందజేత


యాడికి : మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గతేడాది పెన్నా కళాశాలకు చెందిన విద్యార్థులు శేషారెడ్డి, పెద్దిరాజు విహార యాత్రకు వెళ్లి సముద్రంలో మునిగి చనిపోయిన విషయం తెలిసిందే. దీంతో వారి జ్ఞాపకార్థం స్నేహితులు వీరన్నపల్లికి చెందిన కమలేశ్వర్, మహేష్‌రెడ్డి, పవన్‌కళ్యాణ్ రెండు నెలల సరిపడా నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు బత్తల ప్రసాద్ మాట్లాడుతూ సొంత వారి కోసం ఏమీ చేయలేనట్టువంటి సమాజంలో స్నేహితుల కోసం సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు.

పబ్లిక్ హెల్త్ వర్కర్లు తప్పనిసరిగా కోటు ధరించాలి

నగర కమిషనర్ బాలస్వామి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ప్రతి పబ్లిక్ హెల్త్ వర్కర్లు తప్పనిసరిగా ఆప్రాన్ వేసుకునే విధులకు హాజరుకావాలని కమిషనర్ బాలస్వామి ఆదేశించారు. గురువారం నగరంలో పారిశుద్ధ్య పనులను కమిషనర్ బి బాలస్వామి పరిశీలించారు. ఇందులో భాగంగా రెండవ సర్కిల్ మస్టర్ ఆఫీస్ తనిఖీ,ఐటిఐ ట్యాంక్ వద్ద వాటర్ ట్యాంకర్ డ్రైవర్లకు నగరంలో డివైడర్లో చెట్లు ఎక్కడ గాని ఎండిపోకుండా వాటరింగ్ చేయాలని సూచించారు. సప్తగిరి సర్కిల్ కూడలి వద్ద పబ్లిక్ హెల్త్ వర్కర్స్ కు అప్రాన్ ఉంటేనే ఉద్యోగానికి రావాలి లేకుంటే అవసరం లేదు అని కార్మికులకు, కమిషనర్ హెచ్చరించారు. ప్రతి వర్కర్ ఆఫ్రాన్ వేసుకోవాలని ఎందుకంటే మెయిన్ రోడ్స్ లో స్వీపింగ్ చేసేటప్పుడు వెహికల్స్ వస్తూ ఉంటాయి. ఆఫ్రాన్ వేసుకుని స్వీపింగ్ చేయడం వల్ల ప్రమాదాల నుంచి కాపాడుకోవచ్చన్నారు. అంతేకాకుండా డ్రెయినేజీల్లో పూడిక తీసేటప్పుడు కార్మికులు చేతితొడుగులు వాడాలన్నారు. అక్కడి నుంచి శారదానగర్, నవోదయ కాలనీ, హౌసింగ్ బోర్డు, విద్యుత్ నగర్, అరవింద్ నగర్, తదితర ప్రాంతాల్లో చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ విష్ణుమూర్తి, శానిటరీ ఇన్స్పెక్టర్లు వెంకటేష్, నాగేంద్ర, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి ట్యాంకు వద్ద పరిశీలిస్తున్న కమిషనర్ బాలస్వామి

సవరణ బిల్లుతో మైనార్టీల హక్కులను కాలరాయడమే..

వైసిపి మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైఫుల్లా బేగ్

అనంతపురం : వక్ఫ్ సవరణ బిల్లు-2024 అమలు చేస్తే మైనార్టీ హక్కులను కాలరాయడమేనని వైసిపి మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైఫుల్లాబేగ్ అన్నారు. గురువారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సైఫుల్లాబేగ్ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లును బలవంతంగా మైనార్టీలపై రుద్దే ప్రయత్నం చేయడం మంచిది కాదన్నారు. ఈ బిల్లు అమలైతే వక్ఫ్ ఆస్తులపై ఇతర మతస్థులకు కూడా హక్కులు కలిగే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ బిల్లుపై ఇప్పటికే తమ అధినేత జగన్‌తోపాటు తమ పార్టీ ఎంపీలు అటు పార్లమెంటు, ఇటు రాజ్యసభలో వ్యతిరేకించారని గుర్తు చేశారు. అదేవిధంగా వైసిపి ప్రభుత్వ హయాంలో యాత్రకు వెళ్లే రాష్ట్రంలోని ముస్లిములు విజయవాడ నుంచి వెళ్లే అవకాశం కల్పిస్తే కూటమి ప్రభుత్వం రద్దు చేయడం బాధాకరమన్నారు. ఎన్నికల ప్రచారంలో రంజాన్ తోఫా గురించి మాట్లాడిన టిడిపి నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత మాట్లాడకపోవడం బాధాకరమన్నారు.

ఓటరు జాబితా నవీకరణకు సహకరించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

ఓటరు జాబితాను ఎప్పటికప్పుడు నవీకరించేందుకు రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రికల్ రిజిస్టింగ్ ఆఫీసర్ ఎన్.వెంకటేశ్వర్లు కోరారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, పోలింగ్ బూత్ స్థాయి అధికారులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటరు జాబితా ఎప్పటికప్పుడు ఆధునికరించుటకు జాబితాలో కొత్తగా నమోదులు, తొలగింపులు, సవరణలు, చేర్పులు, మార్పులపై అవసరమైన దరఖాస్తులను ప్రజల నుండి ఇప్పించాలని కోరారు. పోలింగ్ బూత్ స్థాయి అధికారి ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారని, రాజకీయ పార్టీల ఏజెంట్లు బిఎల్వోలతో సహకరించి ఓటర్ల జాబితా నవీకరణకు చేయూతనివ్వాలని కోరారు. ఈ సమావేశంలో నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాలకు చెందిన తహశీల్దార్లు, ఎన్నికల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎలక్ట్రికల్ రిజిస్టింగ్ ఆఫీసర్



ల్యాప్‌టాప్ అందజేస్తున్న టిడిపి నేత దివాకరరెడ్డి

ల్యాప్‌టాప్‌లు అందజేత

పెద్దవడుగూరు : ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి చొరవతో పెద్దవడుగూరులోని ఉపాధి, గృహ నిర్మాణ శాఖలకు గురువారం మండలంలోని చిన్నవడుగూరుకు చెందిన టిడిపి యువనాయకుడు దివాకరరెడ్డి ఉచితంగా రెండు ల్యాప్‌టాప్‌లను అందజేశారు. సాంకేతిక రంగంలో కొంత ఇబ్బందులు పడుతున్నందున ఉపాధి ఏపీవో పుల్లారెడ్డి, గహనిర్మాణశాఖ ఎఈ నెట్టింటయ్య దివాకరరెడ్డికి సమస్యను తెలియజేయగా వెంటనే లాప్టాప్లను అందజేసి ఉదారతను చాటుకున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని ఆలూరు రోడ్డులో ఉన్న విద్యుత్ వర్క్‌షాప్‌లో వాచ్‌మెన్‌లుగా పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విద్యుత్ శాఖ డిఎఇ కార్యాలయం ఎదుట సిఐటియు అనుబంధ యునైటెడ్ ఎలక్ట్రానిక్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి సాకే నాగరాజు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు బాషా మాట్లాడుతూ పట్టణంలోని ఆలూరు రోడ్డులో ఉన్న విద్యుత్ స్టోర్, వర్క్‌షాప్, ఎస్‌పిఎం, ఏమార్టీ స్టోర్‌ల్లో 14 మందికిపైగా వాచ్‌మెన్లు కాంట్రాక్టు పద్ధతిన కార్మికులుగా పని చేస్తున్నారన్నారు. అయితే విద్యుత్ శాఖ అధికారులు వారికి కాపాల పనులతోపాటు ఇతర పనులకు పురమాయిస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. వారికి కేవలం కాపలా పనులనే పెట్టాలని, సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణ యునైటెడ్ ఎలక్ట్రానిక్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా సాకే నాగరాజు, అధ్యక్షులుగా ఎస్‌కెఎం బాషా, కార్యదర్శిగా డి.రవితేజ, కోశాధికారిగా హుస్సేన్ పీరా, ఉపాధ్యక్షులు జి.సురేష్, సహాయ కార్యదర్శి బి.వినోదిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగిలిన వారిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.



నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు


సిఎం చంద్రబాబును కలిసిన ఎంపి, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును సిఎం ఛాంబర్‌లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా అనంతపురం నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల గురించి చర్చించారు. మొత్తం పరిస్థితులపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరాతీశారు. అన్ని అంశాలను ఎమ్మెల్యే దగ్గుపాటి కూలంకశంగా వివరించారు. మరోవైపు నియోజకవర్గంలో జరుగుతున్న అభివద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. ముఖ్యంగా డంపింగ్ యార్డ్ తరలింపు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, మరువ వంక ప్రొటెక్షన్ వాల్ తోపాటు పలు అభివద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అన్ని అంశాల మీద ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఈ బడ్జెట్ లోనే నిధులు కేటాయించేలా చూస్తామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

మాదిగ జాతి ఉన్నంత వరకూ చంద్రబాబు వెంటే ఉంటాం

30ఏళ్ల కలను సహకారం చేసిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటే మాదిగ జాతి ఉంటుందని టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి వన్నూరప్ప, నగర అధ్యక్షుడు సాకే వెంకటేష్, కదిరప్ప, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పూజారి చెన్నకేశవులు అన్నారు. ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. దళితులకు న్యాయం చేయాలంటే టిడిపితోనే సాధ్యం అన్నది మరోసారి రుజువైందన్నారు. మా మాదిగలంతా జీవితం అంతా ముఖ్యమంత్రి చంద్రబాబు వెంట నడుస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పవన్, హరికష్ణ, నారాయణస్వామి, శ్రీకాంత్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



సిఎం చంద్రబాబుకు వినపత్రాలు అందజేస్తున్న ఎంపి, ఎమ్మెల్యేలు

సిఎం చంద్రబాబుతో ఎంపి అంబికా భేటీ


అనంతపురం రూరల్ : ముఖ్యమంత్రి చంద్రబాబుతో అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ గురువారం భేటీ అయ్యారు. ఇందులో భాగంగా ప్రజా సమస్యలతోపాటు అనంతపురం పార్లమెంట్ అభివృద్ధిపై సిఎంతో చర్చించారు. ముఖ్యంగా కరువు ప్రాంతమైన అనంతపురంలో ప్రధాన అవసరాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, రైతు సంక్షేమం, ఉపాధి అవకాశాలు, విద్యా రంగ అభివృద్ధి వంటి కీలక అంశాలపై ముఖ్యమంత్రికి వివరించారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

సిడిపిఒ ఉమాశంకరమ్మ

ప్రజాశక్తి-శింగనమల

అంగన్వాడీ సెంటర్లలో చిన్నారులతో మంచి పోషణతోపాటు విలువలతో కూడిన విద్యను అందించాలని ఐసిడిఎస్ సిడిపిఒ ఉమాశంకరమ్మ సూచించారు. గురువారం మండల పరిధిలోని పెరవలి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు 'పోషం పడాయి..' కార్యక్రమంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో 0 నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు అంగన్వాడీ కార్యకర్తలు మంచి పోషణ, విలువలు, శిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. పిల్లలు మానసికంగా శారీరకంగా సామాజికంగా పెరిగేందుకు పోషకాహారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ఉమాదేవి, ధనలక్ష్మి, రమణమ్మ, రత్నమ్మ, నాగేశ్వరమ్మ, కాంతమ్మ, భారతమ్మ, నాగమ్మ, ప్రమీలమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



శింగనమల మండలం పెరవలిలో శిక్షణ ఇస్తున్న సిడిపిఒ ఉమాశంకరమ్మ



పెద్దపప్పూరు మండలంలో శిక్షణ ఇస్తున్న సిడిపిఒ సాజదాబేగం

పెద్దపప్పూరు : మండల పరిధిలోని జూటూరు జెడ్పీహెచ్ హైస్కూల్‌లో అంగన్వాడీ టీచర్లకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇందులో భాగంగా 'పోషం పడాయి..' కార్యక్రమంపై సిడిపిఒ సాజదా బేగం వివరించారు. మూడు నెలల నుంచి మూడేళ్ల వరకూ పౌష్టికాహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నారాయణమ్మ, రామలక్ష్మి, కల్పన, వెంకటలక్ష్మి, శంషాద్ బేగం, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు నిధులివ్వాలని వినతి

ప్రజాశక్తి-శింగనమల

వేసవిని దృష్టిలో ఉంచుకుని శింగనమల నియోజకవర్గంలో తాగునీటి సమస్య నివారణకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌కు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో కరువు మండలాలకు వేసవికాలం దృష్ట్యా నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే జల్ జీవన్ మిషన్ కింద గతంలో నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించాలని కోరారు. ఇందుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



పవన్‌కళ్యాణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

సిఎఎస్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీ కృష్ణదేవరాయ యూనివర్శిటీలో ప్రొఫెసర్లకు అక్రమంగా నిర్వహిస్తున్న సిఎఎస్‌ను రద్దు చేయాలని ఐసా నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం స్థానిక వర్శిటీలో వైస్‌ఛాన్సలర్ అనితను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐసా నాయకులు మాట్లాడుతూ జీవో 203కు విరుద్ధంగా ఉన్న 21 అసిస్టెంట్ ప్రొఫెసర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఐసా రాష్ట్ర అధ్యక్షుడు వేమన, జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, యూనివర్శిటీ కార్యదర్శి కృష్ణ, నాయకులు యమాన్నా, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఐసా నాయకులు

నేరాలు ఘోరాలు

రైలు ఢీకొని యువకుడు మృతి



మృతిచెందిన రాజశేఖర్

గుత్తి : మండలంలోని జక్కలచెరువు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు రోడ్డు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. జిఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపిన వివరాల మేరకు.. జక్కలచెరువు గ్రామానికి చెందిన రాజశేఖర్ (28) బుధవారం రాత్రి బహిర్భూమి కోసం రైలు రోడ్డు వైపు వెళ్లాడు. తిరిగి రైలు రోడ్డు దాటుతుండగా గూడ్స్‌రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో క్షతగాత్రున్ని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతుడికి భార్య, పిల్లలు కలరు. ఘటనపై జిఆర్పి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మినుము వామి దగ్ధం

గుత్తి : మండలంలోని శ్రీపురం గ్రామంలో గురువారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఉండ్ర శివ అనే రైతుకు చెందిన మినుము పంట వామి దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన వివరాలిలా మేరకు గ్రామానికి చెందిన రైతు ఉండ్ర శివ తన పొలంకు సమీపంలో కాలువలో నీరు ప్రవహిస్తుండటంతో తనకున్న మూడెకరాల పొలంలో మినుము పంట సాగు చేశాడు. పంట ఉత్పత్తి తొలగించిన అనంతరం పొలంలో వామి వేసి ఉంచాడు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు మినుము వామికు నిప్పు పెట్టడంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. గురువారం ఉదయం పొలం దగ్గరకు వెళ్లిన సమీప పొలాల రైతులు గమనించి రైతు శివకు సమాచారం అందించారు. గ్రామంలోని రైతులతో కలిసి పొలం దగ్గరకు చేరుకుని చూడగా అప్పటికే మినుము వామి మొత్తం కాలి బూడిదైంది. పంట దిగుబడి బాగా వచ్చిందని తన అప్పులు తీరుతాయనుకుంటే పంట మొత్తం కాలిపోయి రూ.2లక్షలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.



బయోమెట్రిక్ పరికరాలను అందజేస్తున్న ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్

బయోమెట్రిక్ పరికరాలు పంపిణీ

గుత్తి : మండల వ్యాప్తంగా పింఛన్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సరఫరా చేసిన నూతన బయోమెట్రిక్ డివైజు(పరికరాలు) లను ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ గురువారం పంపిణీ చేశారు. గతంలో ఉన్న డివైజ్లు తరచూ మొరాయిస్తుండటంతో పింఛన్ల పంపిణీ ఆలస్యం అవుతుండేది. దీంతో ప్రభుత్వం మండలానికి 123 బయోమెట్రిక్ నూతన డివైజ్లను ప్రభుత్వం సరఫరా చేసింది. మండలంలోని 123 మంది సచివాలయ ఉద్యోగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శివాజీరెడ్డి, కార్యాలయ సిబ్బంది సుమన, అబ్దుల్, తదితరులు పాల్గొన్నారు.

23న ఉచిత కంటి వైద్య శిబిరం

ఉరవకొండ : ఉరవకొండలోని శ్రీ గాంధీ హరిజన హాస్టల్ ప్రాంగణంలో ఈనెల 23వతేదీన ఉచిత కంటి మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు చేయూత ఫౌండేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మంద విజయ్‌కుమార్, మధు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

పెద్దవడుగూరు : ప్రతి విద్యార్థి బాల్యవివాహాలను వ్యతిరేకించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శ్రీనివాసబాబు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతి అనంతరం కొందరు తల్లిదండ్రులు పిల్లలకు వివాహాలు చేస్తున్నారన్నారు. వాటిని మీరు వ్యతిరేకించి మంచి ఉన్నత విద్యను పొందేలా విద్యార్థులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సూపర్‌వైజర్ శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్ల వేతనాల మంజూరు హర్షణీయం

కళ్యాణదుర్గంరూరల్ : ఫాస్టర్ల వేతనాలు మంజూరు చేస్తూ జీవో జారీ చేయడం హర్షణీయమని టిడిపి నాయకులు ధర్మతేజ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రజావేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం క్రిస్టియన్ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందన్నారు. అయితే చంద్రబాబు సిఎం అవుతానే తిరిగి జీవం పోశాడన్నారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు ఇటి స్వామి దాసు, బిషప్ జాన్సన్‌బాబు, పాస్టర్లు జయరాజ్, మల్లికార్జున పౌల్, అజర్య, హరీష్, పిల్పు ప్రకాష్, యెషయా, తిమోతి, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవిపై అవగాహన పోస్టర్లు విడుదల

కళ్యాణదుర్గం రూరల్ : ఎపి రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ విభాగం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో హెచ్ఐవి, ఎయిడ్స్ అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రిడ్స్ ప్రాజెక్టు మేనేజర్ మహేష్, ఐసిటిసి కౌన్సిలర్ ఈశ్వరయ్య, టిబి నివారణ సూపర్‌వైజర్ సత్యనారాయణ, స్టాఫ్ నర్స్ సుగణ, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న అతిథులు

యుద్ధ ప్రాతిపదికన కులగణన చేపట్టాలి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీష్

ప్రజాశక్తి-గుంతకల్లు

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కులగణన చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరగుడి జగదీష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బిటి పక్కీరప్ప భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కులగణన చేపట్టకపోతే ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని అన్నికులాలను సమీకరించి అంబేద్కర్ చిత్రపటంతో నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మాదారి మాదాసి కురువ, బేడ బుడగజంగాల కులస్తులు, రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో బోయ, వాల్మీకి సామాజిక వర్గాలకు చెందిన వారిని ఎస్టీలుగా గుర్తింపు ఉందని, రాష్ట్రంలో కూడా ఎస్టీలుగానే గుర్తించాలని డిమాండ్ చేశారు. ఇకపోతే ఏప్రిల్, మేనెలల్లో గ్రామస్థాయి, మండల పార్టీ మహాసభలు, జూన్, జూలై నెలల్లో జిల్లా మహా సభలు, ఆగస్టు 21, 22, 23వతేదీల్లో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, మండల కార్యదర్శి రాము రాయల్, సహాయ కార్యదర్శి రామాంజనేయులు యాదవ్, రాష్ట్ర సమితి సభ్యులు మురళీకృష్ణ, ఎఐటియుసి నాయకులు ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర నాయకులు డి.జగదీష్



వాటర్ బాటిళ్లను అందజేస్తున్న నాగరాజు

వైష్ణవి నైట్‌వేర్స్ అధినేత నాగరాజు ఔదార్యం

అనంతపురం సిటీ : స్థానిక సరోజినీ రోడ్డులో ఉన్న వైష్ణవి నైట్‌వేర్స్ అధినేత నాగరాజు వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు మంచినీళ్ల బాటిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోగుల కోసం వచ్చిన వారికి తనవంతు సాయంగా లీటర్ వాటర్ బాటిళ్లను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు మిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఒంటిపూట తరగతులు నిర్వహించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న జిసిటిఎ నాయకులు

అనంతపురం : ఎస్కెయు పరిధిలోని అన్ని డిగ్రీ కళాశాలల్లో ఒంటిపూట తరగతులు నిర్వహించాలని ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం (జిసిటిఎ) ఉమ్మడి జిల్లా కార్యవర్గ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎస్కెయులో విసి అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, సిడిసి డీన్ రామ్‌గోపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, సత్యసాయి జిల్లాల అధ్యక్షులు కె.శ్రీధర్, కె.జయప్ప, జిల్లా కార్యదర్శి ఎం.బాలాజీనాయక్, జిసిటిఎ జోనల్ కార్యదర్శి కేశవులు, ఎస్కెయు సెక్రటరీ శివశంకర్, జిసిటిఎ ఉమెన్స్ సెక్రటరీ శ్రీలేఖ, జిసిటిఎ నాయకులు జి.రాజశేఖర్, జి.చలపతి, వెంకటేష్, తిరుమలేష్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఇకెవైసి పూర్తి చేయాలి

రాయదుర్గం : రాయదుర్గంతోపాటు మండల పరిధిలోని చౌక దుకాణం డీలర్లు మార్చి 31వ తేదీలోగా తమ పరిధిలో రేషన్‌కార్డులదారులతో ఇకెవైసి ప్రక్రియ పూర్తి చేయాలని తహశీల్దార్ నాగరాజు సూచించారు. గురువారం మధ్యాహ్నం స్థానిక రెవెన్యూ సమావేశ హాలులో చౌక దుకాణపు డీలర్లు, ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు, వీఆర్వోల సహకారంతో తమ దుకాణం పరిధిలోని రేషన్‌కార్డులకు సంబంధించిన ఇకెవైసి ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ఇకెవైసి పూర్తికాని రేషన్ కార్డులకు వచ్చే నెల నుంచి నిత్యావసర సరుకుల పంపిణీ రాదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సిఎస్‌డిటి, సుదర్శనాచార్యులు, డీలర్లు, ఎండిఎం ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండలంలోని సోనపల్లి, జి.కొత్తపల్లి ఆర్డీటీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో గురువారం వజ్రగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద జెసి నాగలక్ష్మమ్మ కళ్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రాజు, ఎస్ఐ నాగేంద్రప్రసాద్, తాడిపత్రి ఏరియా ఆర్డీటీ లీడర్ లలిత మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థికంగా బలపడాలన్నారు. ముఖ్యంగా మహిళల హక్కుల కోసం అహర్నిశలు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ మండల సిఒ ఓబులేష్, మహిళా పొదుపు సంఘం సభ్యురాలు మౌనిక, పొదుపు సంఘాల సభ్యులు కొత్తపల్లి పెద్దిరాజు, ఆదినారాయణ, సోమనపల్లి పెద్ద వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వక్తలు

నేడు వేలంపాట

ఉరవకొండ : వజ్రకరూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో దినసరి సంత, వాటర్ ప్లాంట్ నిర్వహణకు శుక్రవారం వేలంపాట నిర్వహించనున్నట్లు సర్పంచు మోనాలిసా, పంచాయతీ కార్యదర్శి మల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనాలనుకునే వారు పంచాయతీకి ఎలాంటి బకాయిలు ఉండరాదన్నారు. అంతేగాకుండా ముందుగా రూ.25వేలు చెల్లించాలన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కంబదూరు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఎరుకుల సేవాసంఘం అధ్యక్షుడు ములకనూరు సుబ్బరాయుడు సౌజన్యంతో గురువారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహశీల్దార్ బాలకిషన్ ప్రారంభించారు. వివిధ పనుల నిమిత్తం తహశీల్దార్ కార్యాలయానికి విచ్చేస్తున్న ప్రజల దాహార్తి తీర్చేందుకు ముందుకొచ్చిన సుబ్బరాయుడును తహశీల్దార్ అభినందించారు.



కంబదూరు మండలంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాయదుర్గం : అఖిలభారత చిరంజీవి యూత్ గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని నేతాజీ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సామాజిక కార్యకర్త నాదే అలీ ప్రారంభించారు. తొలి రోజు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి అభిమాన సంఘం అధ్యక్షుడు కెబి హరికృష్ణ, డిటి గౌతం, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : మండలంలోని కట్టకిందపల్లి గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు జయరామ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుక్కబాబు, సల్లా మల్లికార్జున, సల్లా సుంకిరెడ్డి, సల్లా నాగిరెడ్డి, వరిమడుగు హనుమంతురెడ్డి, బోయ ఓబులేసు, జిట్టా పెద్దన్న, సల్లా మల్లేష్, ప్రకాష్, మధు, ఫీల్డ్ అసిస్టెంట్ జిట్టా సుమన్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి : మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు సమీపంలో ఉన్న చలివేంద్రంలో గురువారం చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎఎస్ఐ వెంకటేశులు మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో నీటితోపాటు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు మారుతీశ్వర రామమూర్తి, ఎఫ్‌టిఎఫ్ సీనియర్ నాయకులు బిసి తిమ్మప్ప, విశ్వేశ్వరప్రసాద్, గ్రామపెద్దలు సత్యనారాయణశాస్త్రి, మల్లికార్జున, లక్ష్మణమూర్తి, పెద్ద ఓబులేసు, అతావుల్లా, ఎపిటిఎఫ్ జోనల్ కార్యదర్శి బొమ్మయ్య, ఎపిటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈరప్ప, పూర్వ రాష్ట్ర కౌన్సిలర్ రామప్ప, ఉపాధ్యాయులు తలారి వరలక్ష్మి, మండలం అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి మంజునాథ్, రామకృష్ణ, రవికుమార్, సునీత, ప్రియాంక, భాషీరా, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్కే ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం కుందుర్పి మండల వ్యాప్తంగా ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని రుద్రంపల్లి, ఎనుము లదొడ్డి, కృష్ణాపురం, బెస్తరపల్లి, ఆపిలేపల్లి, మందలపల్లి, కెంచంపల్లి, కుందుర్పి, బండమీదపల్లి, మలయనూరు, అల్లాపురం, తమ్మయ్యదొడ్డి, మాయదారులపల్లి గ్రామాల్లో నడుస్తున్న విలువల బడుల్లో పిచ్చుకల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయా పాఠశాలల వద్ద పిచ్చుకలకు గింజలు, నీటి సౌకర్యం కల్పించేందుకు ఖాళీ ప్లాస్టిక్ సీసాలు కత్తిరించి చెట్లకు వేలాడదీశారు.



ప్లాస్టిక్ సీసాలను చూపుతున్న చిన్నారులు

ఈ కార్యక్రమంలో దిలీప్, కావ్య, నాగరాజు, ఆశ లక్ష్మి, అనిత, లీలావతి, హనుమంతురాయుడు, గిరి ప్రసాద్, రఘు, లక్ష్మి, సౌమ్య, మరిస్వామి, మంజునాథ్, మల్లికార్జున, తదితరుల పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

బొమ్మనహాల్ : రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని ముస్లిములకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ క్యాక్రమంలో మజీద్ ముతవల్లి నూర్‌మొహమ్మద్, జమాత్ ముస్లిం సోదరులు పాల్గొన్నారు.